# అభివృద్ధి చేశా.. మరోమారు ఆశీర్వదించండి


మునుగోడులో మహిళకు కరపత్రాలు అందించి ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

- ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి
- మునుగోడు మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం

మునుగోడు, నవంబర్ 16 : రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మునుగోడు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, మరింత అభివృద్ధి కోసం రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను మరో మారు ఆశీర్వదించాలని బీఆర్‌ఎస్ మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలోని 1, 2, 3, 4 వార్డుల్లో గడపగడపకూ ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు 1వ వార్డులో ఉన్న రెణుకా ఎల్లమ్మ ఆలయంలో స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజల అధిక సంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వారంతా ఎమ్మెల్యే వెంటే ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించారని, తాను ఎమ్మెల్యే అయ్యాక మునుగోడు నియోజకవర్గాని ఎవరూ ఉహించని విధంగా అభివృద్ధి చేశానని తెలిపారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో మరోసారి గులాబీ జెండా ఎగురడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మునుగోడు మండల కేంద్రంలో సుమారుగా రూ. 3 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. 2018లో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని ప్రజలు గెలిపిస్తే అభివృద్ధి పనులు చేయడం చేతకాక, ప్రజల అవసరాలు తీర్చడంలో విఫలమమై, తన స్వార్థం కోసం పార్టీలు మారాడన్నారు. మరోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తూ మళ్లీ ప్రజలకు మాయ మాటలు చెబుతూ వారిని మోసం చేసేందుకు యత్నిస్తున్నాడని ఎద్దేవా చేశారు. నిజమైన సేవకులు, పాలకులు ఎవరనేది ప్రజలు ఆలోచించి సరైన నాయకుడిని ఎన్నుకుంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రతి పల్లెలో సీసీ రోడ్లు వేశామని, మౌలిక వసతులు కల్పించామని చెప్పారు. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిందన్నారు. కానీ బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలల్లో వారు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేరలేదన్నారు. అలాంటి నాయకులే ఇప్పుడు తెలంగాణలో హామీలిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో గత పాలకులు 60 ఏండ్లలో చేయలేని అభివృద్ధిని సీఎం కేసీఆర్ పదేండ్లలో చేసి చూపించారని పేర్కొన్నారు. మూడోసారి కేసీఆర్ సీఎం కాగానే మ్యానిఫెస్టోలో ప్రకటించిన ప్రతి హామీని నెరవేరుస్తారన్నారు. ప్రజలకు మరిన్ని పథకాలు అందుతాయన్నారు. దివ్యాంగుల పింఛన్ రూ.6వేలు, ఆసరా పింఛన్ రూ.5వేలు, రైతు బంధు సాయం రూ.16వేలు, సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.3వేలు అందన్నుట్లు చెప్పారు. మహిళలకు రూ.400కే వంట గ్యాస్, ఆరోగ్యశ్రీ గరిష్ట పరిమితిని రూ.15లక్షలు, తెలగాణ అన్నపూర్ణ పథకం ద్వారాఆ రేషన్ షాపుల నుంచి సన్నబియ్యం పంపిణీ, రేషన్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబాలకు రూ.5లక్షలు బీమా వర్తంపచేయడం ద్వారా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేద కుటుంబాలకు ఆసరాగా నిలుస్తుందన్నారు. నియోజక వర్గంలో తాను చేసిన అభివృద్ధి ప్రతి ఇంటి ముందు కనిపిస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను అధిక మెజార్టీతో గెలిపిస్తే రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం చౌరస్తాలో ఉన్న దుకాణాల యజమానులను కలిసి ఓటు అభ్యర్థించారు. ఓ టీకొట్టులో ఎమ్మెల్యే కూసుకుంట్ల స్వయంగా చాయ్ తయారు చేసి ప్రజా ప్రతినిధులకు ఇచ్చారు. ఆయన వెంట ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బండ పురుశోత్తంరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి, పాలకూరి నరిసింహగౌడ్, పందుల శ్రీను, ఈద శరత్‌బాబు, గుర్రం అంజయ్య, యాసరాణీ దినేశ్, రావిరాల కుమారస్వామి, పందుల నరిసింహ, వట్టికోటి నరిసింహ, పెరమాళ్ల ప్రయణ్‌కుమార్, దుబ్బరవి, దుబ్బ రాజు, ఈరిగి విజయ్, మిర్యాల మధకర్, వాజిద్, పాలకూరి రాము, నకిరేకంటి వెంకన్న, పందుల పాపయ్య, లింగస్వామి, రాజేశ్ పాల్గొన్నారు.


మునుగోడు: ప్రచారంలో చాయ్ తయారు చేస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి


పస్నూరు వాగుపై నిర్మించిన బ్రిడ్జి

# వాగు కష్టాలు తీరినయ్

- రూ.5.13 కోట్లతో పస్నూరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

నాంపల్లి, నవంబర్ 16 : మండలంలోని పలు గ్రామాల గుండా ప్రవహించే వాగులపై వంతెనలు లేక పోవడంతో ప్రజలు వాటిని దాటేందుకు అవస్థలు పడేవారు. ముఖ్యంగా వర్షాకాలంలో వాగు దాటే క్రమంలో ప్రమాదవశాత్తు నీటి ఉధృతికి కొట్టుకు పోయిన ఘటనలూ ఉన్నాయి. సమైక్య రాష్ట్ర పాలకులు వీటి గురించి పట్టించుకోలేదు. తెలంగాణ ఏర్పాటయ్యాక మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించి వాగులపై వంతెనలు నిర్మింపజేశారు. దాంతో ప్రయాణికుల వెతలు తీరాయి.

## వంతెన నిర్మాణం పూర్తి

మండలంలోని పస్నూర్ గ్రామం మధ్య గుండా ప్రవహిస్తున్న వాగుపై వంతెన సరిగా లేక పోవడంతో ప్రజల రాక పోకలకు ఇబ్బందులు ఎదురయ్యేది. దానికి తోడు వర్షాకాలంలో గ్రామ చెరువు పూర్తిగా నిండి అలుగు పోసిన ప్రతి సారీ నీటి ఉధృతికి రాకపోకలు నిలిచి పోయేవి. ఈ రెండు ప్రాంతాల్లో వంతెనలు నిర్మించాలని గ్రామ ప్రజలు గతంలో ప్రజాప్రతినిధుల, అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. తెలంగాణ ఏర్పాటు అనంతరం మునుగోడు ఎమ్మెల్యేగా కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మొదటి సారి ఎన్నికైన వెంటనే గ్రామ ప్రజల ఆకాంక్ష మేరుకు గ్రామంలో రెండు వంతెనలు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.5.13 కోట్లను మంజూరు చేయించారు. పనులు కూడా వేగవంతంగా నిర్వహించిన వంతెనల నిర్మాణం పూర్తి చేశారు. దాంతో గ్రామస్తుల ఏండ్ల నాటి కష్టాలు తీరాయి.

### మా బాధలు తీరినయ్



మా ఊర్లో ఉన్న వాగులపై రెండు పెద్ద బ్రిడ్జీలు నిర్మిస్తారని నేను కలలో కూడా అనుకోలేదు. గతంల వాన వస్తే రాకపోకలు బంద్ అయ్యే వి. బ్రిడ్జిలు నిర్మించాక ఎంత వాన వచ్చినా, వరదలు వచ్చినా ఇబ్బంది లేదు. గతంల చాలా ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు ఏ ఇబ్బందీ లేకుండా ప్రయాణం సాగిస్తున్నాం.

–దండిగ మల్లయ్య, పస్నూర్


చౌటుప్పల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల కుటుంబ సభ్యులు

# అభివృద్ధిని చూసి ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలి

- ఎమ్మెల్యే కూసుకుంట్ల కుటుంబ సభ్యులు

చౌటుప్పల్, నవంబర్ 16 : ఉప ఎన్నిక తర్వాత ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి కోట్ల రూపాయలతో చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, మరింత అభివృద్ధి చెందేందుకు మరోమారు ఎమ్మెల్యేగా కూసుకుంట్లను గెలిపించాలని ఎమ్మెల్యే సతీమణి అరుణ, కుమార్తె రమ్య, కోడలు స్రవంతి కోరారు. గురువారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో వారు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి మహిళలకు బొట్టుపెట్టి కారుగుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి మళ్లీ గెలిపిస్తే ఈ ప్రాంతంలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, నాయకులు సుర్కంటి నవీన్‌రెడ్డి, చింతల మహిపాల్‌రెడ్డి, భగవంత్‌రెడ్డి, పస్తం గంగారాములు, భీమీడి రాంరెడ్డి, కానుగు ప్రవీణ్, నందగిరి వెంకటేశ్, లింగస్వామి, శంకర్, అధిక సంఖ్యలో స్థానికులు, మహిళలు పాల్గొన్నారు.


గట్ల మల్లేపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు

# బీఆర్‌ఎస్‌ను గెలిపించి సంక్షేమాన్ని కొనసాగించాలి

- మల్లేపల్లిలో నాయకుల విస్తృత ప్రచారం

నాంపల్లి, నవంబర్ 16 : రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని, రాబోయే ఎన్నికల్లో ప్రజలంతా కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించి సంక్షేమాన్ని కొనసాగించాలని మండలంలోని గట్ల మల్లేపల్లి సర్పంచ్ నాగుల వంచ శ్రీలత అన్నారు. గురువారం ఎమ్మెల్యే కూసుకుంట్లకు మద్దతుగా గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ మ్యానిఫెస్టోను వివరించి ఓట్లు అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో స్కాంలు తప్ప అభివృద్ధి శూన్యమని, సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కూసుకుంట్ల వెంటే గట్టుప్పల్ ప్రజలు

గట్టుప్పల్, నవంబర్ 16 : సీఎం కేసీఆర్ పాలనలోనే రాష్ట్రంలోని అన్ని వర్గాలకు న్యాయం జరుగుతున్నదని, ప్రజలు మరో మారు బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు గురువారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, రాబోయే రోజుల్లో చేపట్టనున్న కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. మరోసారి ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బండారి చంద్రయ్య, నాయకులు కర్నాటి అబ్బయ్య, చేరుపల్లి కృష్ణ, చేరుపల్లి రమేశ్, లక్ష్మయ్య, వెంకటేశం, రాంబాబు, నగేశ్, శ్రీను, రాజుకుమార్ పాల్గొన్నారు.


గట్టుప్పలలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

# పేద కుటుంబాలకు ఎమ్మెల్యే కూసుకుంట్ల ఆర్థిక సాయం

మర్రిగూడ, నవంబర్ 16 : మండలంలోని దామెరభీమనపల్లి గ్రామానికి చెందిన నారపాక పార్వతమ్మ, మెట్టు సత్తమ్మ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. వారివి పేద కుటుంబాలు కావడంతో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఇరు కుటుంబాలకు చెరో రూ.20వేల చొప్పున ఆర్థిక సాయాన్ని పంపించారు. సదరు సాయాన్ని మాజీ సర్పంచ్ మునగాల అంతిరెడ్డి అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నడిమింటి శ్రీను, ప్రధాన కార్యదర్శి వనమాల మహేశ్ పాల్గొన్నారు.